క్లుప్తంగా

నీటి పన్ను చెల్లించాలి

ప్రొద్దుటూరు : నీటి పన్ను బకాయిదారులు ఈనెల 10వ తేదీలోపు చెల్లించకుంటే కొళాయి కనెక్షన్ తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి పన్ను బకాయిలు చెల్లించాలని సంబంధిత అధికారులు పలుమార్లు అడిగినప్పటికీ చెల్లించలేదని ఆయన పేర్కొన్నారు. నీటి పన్ను చెల్లించని వారి ఇంటి కొళాయి కనెక్షన్‌ను ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ చట్టం 1965 సెక్షన్ 117(4) ప్రకారం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగిస్తామని తెలిపారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫాం తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్

ప్రొద్దుటూరు క్రైం : ఆటోడ్రైవర్లు తప్పకుండా యూనిఫాం ధరించాలని ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్ తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండు, రాజీవ్‌సర్కిల్ ప్రాంతాల్లోని ఆటో డ్రైవర్లకు శుక్రవారం ఎస్ఐ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు విధిగా యూనిఫాం ధరించడంతో పాటు తగు పత్రాలను కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా ఆటో నడపడం నేరమని చెప్పారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ.. ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. ఖరీదైన వస్తువులు ఆటోలో మరచిపోతే వెంటనే పోలీసులకు అప్పగించాలని తెలిపారు.

గ్రంథాలయానికి సొంత భవనం మంజూరు చేయాలి

బద్వేలు అర్బన్ : దాదాపు 60 ఏళ్ళుగా అద్దె భవనంలో కొనసాగుతున్న బద్వేలుశాఖ గ్రంథాలయానికి సొంత భవనం మంజూరు చేయాలని ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యస్దానిబాషా, జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషలు తెలిపారు. శుక్రవారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విజ్ఞాన భాండాగారాలుగా పేరుపొందిన గ్రంథాలయానికి 60 ఏళ్ళుగా సొంత భవనం లేకపోవడం దారుణమన్నారు. పట్టణంలో ఎన్నో ప్రభుత్వ స్థలాలు కబ్జాదారుల కబంధహస్తాల్లో ఉన్నప్పటికీ వాటిని కాపాడి గ్రంథాలయ భవన నిర్మాణానికి అధికారులు స్థలం కేటాయించకపోవడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని గ్రంథాలయానికి స్థలంతో పాటు ప్రభుత్వం నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆవాజ్ పట్టణ అధ్యక్షుడు ఎస్.ఏ.సత్తార్, ఆవాజ్ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరామర్శించారు. సైబర్ నేరగాళ్ళ వేధింపులతో వైజాగ్‌లో ఆత్మహత్య చేసుకుని నాగరాజు కుమారుడు కార్తీక్‌రాజు మృతిచెందాడన్న విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. సైబర్ నేరగాళ్ళ వేధింపులతో ఎంతో భవిష్యత్తు ఉన్న కార్తీక్‌రాజు చిన్న వయస్సులోనే మృతిచెందడం బాధాకరమని ఎమ్మెల్యే అన్నారు. కుటుంబానికి అన్నిరకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, వైస్ ఎంపీపీ బుట్టినరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు చిదానందంరెడ్డి, కృష్ణారెడ్డి, యువజన విభాగం నాయకుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు ఆరోగ్యంగా ఉండాలి

అట్లూరు : పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి భాస్కర్‌బాబు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సభా భవనంలో ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్యసిబ్బంది, ఆశావర్కర్లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ విలియంరాజు, వైద్యాధికారులు, సీహెచ్ఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్‌బాబు

మీ - సేవల దోపిడీ

- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- అధిక వసూళ్లపై ప్రజల ఆందోళన
- పట్టించుకోని అధికారులు



ఖాజీపేటలోని ఆధార్ కేంద్రం

ఖాజీపేట : మీ-సేవ, ఆధార్ కేంద్రాల్లో దోపిడీ మితిమీరిపోయింది. ప్రభుత్వ సంబంధ వ్యవహారాలన్నింటినీ మీ సేవలకు అప్పగించడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించి కేంద్రాలను నడుపుతున్నారు. ఖాజీపేట మండలంలో ఆరు మీసేవా కేంద్రాలు, మూడు ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. ముఖ్యంగా ఖాజీపేట, పుల్లూరు కేంద్రాలపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖాజీపేట, పుల్లూరు మీసేవా, ఆధార్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఆధార్ కేంద్రంలో పేరు, ఫొటో అప్‌డేట్, చిరునామా మార్పు చేసుకుంటే ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు రూ. 50 చెల్లించాలి. అయితే రూ. 120 వసూల్ చేస్తున్నట్లు చేస్తున్నారు. ప్రతి సర్టిఫికెట్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తంలో తీసుకుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కేంద్రాలను పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. చేసేది లేక కొందరు అడిగినంత ఇచ్చి పని చేయించుకుంటున్నారు. అదనపు వసూళ్లపై ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారు.

అధికారులు మౌనం

మీసేవా, ఆధార్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గతంలో తాహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో నిర్వాహకులు అదనంగా వసూలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు దృష్టి సారించి అధిక వసూళ్లను అరికట్టాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



ఆధార్ కార్డులో నా పేరు, నా భార్య పేరు మార్పు కోసం వెలితే రూ. 200 తీసుకున్నారు. కానీ రసీదులో రూ. 50 మాత్రమే ఉంది. ఇది చాలా అన్యాయం. ఎంతో మంది ఆధార్ కేంద్రానికి వస్తుంటారు. అధికంగా వసూలు చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

– ఎం. హరి భాస్కర్‌రెడ్డి, ఖాజీపేట

కేసు నమోదు చేస్తాం



మీసేవా, ఆధార్ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కువ డబ్బులు తీసుకుంటే వెంటనే ఫిర్యాదు చేయాలి. విచారించి కేసు నమోదు చేస్తాం.

– మహబూబ్ బాషా, తాహసీల్దార్, ఖాజీపేట

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే ఆటోడ్రైవర్లపై కఠినచర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని, ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు ఏర్పాటు చేసినా, ఆటోలో సౌండ్ సిస్టం ఏర్పాటు చేసినా సంబంధిత ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్‌స్రూ ఫిట్‌నెస్ సరిఫికెట్ కలిగి ఉండాలని కోరారు. ఎవరైనా లైసెన్స్ లేని డ్రైవర్లు ఉంటే లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, వారికి పోలీసుశాఖ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని కోరారు. ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు సహకరించాలని కోరారు. అలాగే రాత్రి వేళల్లో ఆటోలు నడిపే డ్రైవర్లు అసాంఘీక కార్యకలాపాల, అపరిచిత వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐలు ఎం.సత్యనారాయణ, రవికుమార్, పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలను నివారించాలి



మాట్లాడుతున్న ఆర్అండ్‌బీ ఈఈ విజయభాస్కర్ రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రధాన రహదారుల్లోని బ్లాక్ స్పాట్‌ల వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రొద్దుటూరు ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే, రవాణాశాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో ఆర్టీఓ మురళీధర్, ఎంవీఐ నారాయణనాయక్, ఆర్అండ్‌బీ డీఈ లక్ష్మీనరసింహులు, ఏఈ వెంకటరమణయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

గుండె పోటు బాధితులను ఆస్పత్రికి తరలించాలి



ప్రజలకు గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, ఇతర వైద్యులు

ప్రొద్దుటూరు క్రైం : గుండె పోటు లక్షణాలు కనిపించిన వారిని 1 గంటలోపు ప్రభుత్వాసుపత్రికి తరలించాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం స్టెమి గుండెకు భరోసా కార్యక్రమంపై ఆస్పత్రికి వచ్చిన రోగులకు, సహాయకులకు వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ గుండె నొప్పి వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా గొల్డెన్ అవర్‌లో 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకురావాలన్నారు. ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో పేషెంట్‌కు ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన అనంతరం గుండె పోటు అని నిర్ధారణ అయితే రూ.45 వేలు విలువైన టెనెక్టప్లస్ అనే ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇచ్చి పేషెంట్ ప్రాణాలను కాపాడుతారన్నారు. ఛాతినొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం తదితర లక్షణాలు కనిపిస్తే గుండె పోటుగా భావించాలని సూపరింటెండెంట్ సూచించారు. గుండె నొప్పి వచ్చిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా 1 గంట లోపు పేషెంట్‌ను జిల్లా ఆస్పత్రికి తీసుకొని రావాలన్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

బాల భవిత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోండి



బాలభవిత కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సెకండ్ ఏడీజే సత్యకుమారి

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రి ఆవరణలోని బాలభవిత కేంద్రాన్ని శుక్రవారం రెండవ అదనపు జిల్లా జడ్జి సత్యకుమారి తనిఖీ చేసి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈనెల 10 నుండి 24వ తేదీ వరకు ఇంటింటి న్యాయ ప్రచారంలో భాగంగా బాల భవిత కేంద్రాన్ని జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లలు మొదలు 18 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించి బాల భవిత కేంద్రంలో చికిత్స అందిస్తారన్నారు. ఈ తరహా పిల్లల తల్లిదండ్రులు ఇలాంటి చక్కటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇందు కోసం మండల న్యాయ సేవ అధికార సంస్థ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు జడ్జి పేర్కొన్నారు. ఇంటింటి ప్రచారంలో మండల న్యాయ సేవాధికార సంస్థ వారు 5 టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యాధికారులు, భవిత కేంద్రం నిర్వాహకులు పాల్గొంటారని తెలిపారు. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గల జిల్లా బాల భవిత కేంద్రంలో ఎన్నో సదుపాయలు ఉన్నాయన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రత్యేక పిల్లలు కూడా ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని, వీరి కోసం జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం, వికలాంగుల హక్కుల చట్టం, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టాలను ప్రవేశపెట్టారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

చాపాడు : నిరుద్యోగ యువతీ, యువత స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అందిస్తున్న బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12వ వరకూ గడపు పెంచినట్లు ఎంపీడీఓ వీరకిషోర్ తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపుతో సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో ప్రభుత్వం మంజూరు చేసే స్వయం ఉపాధి యూనిట్ల కోసం అర్హులైన వారు ఈ నెల 12వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం అర్హులను ఎంపిక చేసేందుకు నిర్వహించే ఇంటర్వ్యూల తేదీలను ప్రకటిస్తామని ఎంపీడీఓ చెప్పారు.

రైతుసేవా కేంద్రం తనిఖీ

అట్లూరు : బద్వేలు అర్బన్ రైతుసేవా కేంద్రాన్ని శుక్రవారం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఇ-పంట నమోదు, రైతుల ఈకేవైసీ పరోగతిని సమీక్షించారు. ఇప్పటి వరకు 250 ఎకరాల్లో ఇ-పంట నమోదు చేశామన్నారు. అలాగే పీఎంకిసాన్ నిధులు మూడవ విడత త్వరలో విడుదలయ్యే అవకాశం ఉందని, కనుక సంబంధిత సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు పి.బిందురాణి, మన్నెం సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12వ తేదీ వరకు గడువు పెంపు

అట్లూరు : బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుల గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ భాస్కర్‌బాబు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న బీసీ కార్పొరేషన్ల రుణాలకు వస్తున్న వినతులను దృష్టిలో ఉంచుకుని బీసీ, ఈడబ్ల్యూస్, కాపు సహా వివిధ కార్పొరేషన్‌ల ద్వారా చేస్తున్న యూనిట్ల దరఖాస్తులకు ఈనెల 7వ తేదీవరకు గడువు ఉండగా తాజాగా 12వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తు గడువు పెంచాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కాపు రుణాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించాలని కాపు కార్పొరేషన్ స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యుడు అల్లం చంద్రశేఖర్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాపు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు అవకాశం ఇచ్చిందన్నారు. దీనిపై అభ్యంతరాలు రావడంతో ఈ నెల 12 వరకు పొడిగించారని, రుణాల కోసం అవసరమైన సర్టిఫికేట్‌లను తీసుకోవడానికి సమయం సరిపోదని, అందువల్ల ఈ నెల 28 వరకు గడువు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 32 శాతం కాపులు ఉండగా వంద యూనిట్లు మాత్రమే కేటాయించారని, వంద యూనిట్లు ఏమాత్రం సరిపోవని, యూనిట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. బ్యాంకులు లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకుండా రుణాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటేష్, సుబ్రహ్మణ్యం, సాయివంశీ, రాజేంద్ర పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

బ్రహ్మంగారిమఠం : మండలంలో చౌదరవారిపల్లె గ్రామ రైతులు సాగుచేసి వరి పంటతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నకిలీ విత్తనాలతో నష్టపోయిన వరి రైతుల పోలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యతలేని వరి విత్తనాలు విక్రయించిన వ్యాపారిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. అలాగే 200 ఎకరాలలో సాగు చేసిన రైతులకు నష్ట పరిహారం వచ్చేలా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సునీల్ కుమార్, కమిటీ సభ్యులు రమణమ్మ, అరవింద్, ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఎవరినీ ఉపేక్షించం



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ స్థలాల్లో, వంక పోరంబోకు స్థలాల్లో ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపులో ఎవరినీ ఉపేక్షించేది లేదని తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు హెచ్చరించారు. పట్టణంలోని చెన్నంపల్లె గ్రామ పొలం సర్వే నెంబర్ 1580-ఎ లో గల 1.50 ఎకరాల విస్తీర్ణంలో వెలసిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం పోలీసుల సహకారంతో రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే వారిపై కఠినచర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా నిఘా ఉంచాలని సూచించారు. ఇప్పటికే కొన్ని సర్వే నెంబర్లలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించామని, త్వరలోనే మరిన్ని సర్వేనెంబర్లలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాల్లో గల అక్రమ నిర్మాణాలను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ రవికుమార్, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, ఆర్ఐ సూర్యకుమార్, వీఆర్ఓ జగదీశ్వర్‌రెడ్డి, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్టెమి చికిత్సతో గుండెకు భరోసా



స్టెమి చికిత్సపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

బద్వేలు అర్బన్ : గుండె జబ్బు మరణాలను నివారించేందుకు స్టెమి చికిత్స గుండెకు భరోసా కల్పిస్తుందని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో స్టెమి చికిత్సపై హెల్త్ సెంటర్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాతీనొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసం, గుండె దడ, నీరసం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే అప్రమత్తమై దగ్గరలోని ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. రూ.45 వేలు విలువ చేసే టెనెక్టెప్లస్ ఇంజక్షన్‌ను ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. గుండెజబ్బుల మరణాలను నియంత్రించేందుకు వైద్య సిబ్బంది స్టెమి చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, హెల్త్ హెల్త్ సెంటర్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఏపీజీబీ బ్యాంకు అభివృద్ధికి సహకరించండి



ఆటో లోన్ పొందిన యజమానితో ఏపీజీబీ బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్‌కుమార్‌త్వారో

కలసపాడు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అభివృద్ధికి అధికారులు, ఖాతాదారులు, ప్రజలు సహకరించాలని కడప, అన్నమయ్య జిల్లాల ఏపీజీబీ బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్‌కుమార్‌త్వారో తెలిపారు. శుక్రవారం మండలంలోని కలసపాడు, ఎగువ రామాపురం ఏపీజీబీ బ్యాంకులను ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులు, ఖాతాదారులు, వెలుగు సిబ్బంది, బ్యాంకర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31.12.2024 నాటికి రూ.50 వేల కోట్ల మైలురాయిని దాటిందని తెలిపారు. ఏపీజీబీ బ్యాంకులో అత్యధికంగా 444 రోజులు కలిగిన డిపాజిట్లకు 8.3 శాతం, 333 రోజులు వ్యవధి గల డిపాజిట్లకు అత్యధికంగా 8.05 శాతం వడ్డీ ఇస్తుందన్నారు. ఏపీజీబీ బ్యాంకు ఇచ్చే గృహ, వాహన రుణాలకు 15.02.2025 వరకు ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా ఇస్తామన్నారు. ఇక్కడి ఖాతాదారుల సహకారంతో కలసపాడు శాఖ రూ.109 కోట్లు వ్యాపారం నమోదు చేసిందన్నారు. రాజంపేట రీజనల్ ఆఫీసు, కడప, అన్నమయ్య జిల్లాల్లో ఉన్న 51 శాఖలతో డిసెంబర్ 2024 నాటికి రూ.4374 కోట్ల వ్యాపారం నమోదు చేసిందని తెలిపారు. ఏపీజీబీ బ్యాంకు ఇండియాలో మూడవ స్థానంలో ఉందన్నారు. త్వరలోనే మొదటి స్థానంలోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ స్వాతి, ఆర్.ఓ సీనియర్ మేనేజర్ కె.నాగేశ్వర్, వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.

వరిలో మరుగు నీరు లేకుండా తీసేయాలి



గుంతచీపాడు వద్ద వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

చాపాడు : వరి పంటలో ఎక్కువ రోజులు నిల్వ ఉన్న మరుగునీటిని బయటికి తీసేయాలని కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వీరయ్య, భగవత ప్రియ పేర్కొన్నారు. మండల పరిధిలో గుంతచీపాడు గ్రామంలో ఎదుగుదల లేని వరి పంటను శుక్రవారం ఊటుకూరు డాట్ సెంటర్ కోఆర్డినేటర్ అంకయ్య కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు వీరయ్య, భగవత ప్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిలో లవన సాంద్రత ఎక్కువగా ఉందని దీని వలన వరిలో ఎక్కువ రోజులు నిల్వ ఉన్న మరుగు నీటిని తీసేయాలన్నారు. రైతులు తప్పనిసరిగా భూ సార పరీక్షలు, నీటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించుకునేందుకు 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరాకు 10 కేజీలు లేక కెల్డాన్ గుళికలు 8 కేజీలు వేయాలన్నారు. ఇదే క్రమంలో చీలేటెడ్ జింక్‌ను ఎకరాకు 200 గ్రాములు చొప్పున పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మ్యాగీ, చియ్యపాడు వీఏఏ ఎ.రాము, ఎంపీటీసీ సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

చాపాడు : నులిపురుగులను నిర్మూలిద్దామని వైద్యాధికారులు డా.కావ్యమాధురి, డా. శ్రీవాణి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఈ నెల 10న మండల వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరిచేత నులిపురుగులను నిర్మూలించే అల్బెండజోల్ మాత్రలు తినిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరకిషోర్, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం గౌస్‌మొద్దీన్, ఆశా నోడల్ ఆఫీసర్ సుకన్య, హెల్త్ సూపర్‌వైజర్లు బాబుల్‌రెడ్డి, ప్రసాద్, ఏఎన్ఎం స్రవంతి పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



గోడపత్రాలను విడుదల చేస్తున్న ఎంపీడీఓ, వైద్యాధికారులు

బి.కోడూరు : ఈనెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, ఎంపీడీఓ భాస్కర్‌రావులు తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను వారు విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 10వ తేదీన పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు ఉచితంగా ఇస్తారన్నారు. మండలంలో 1-5 సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 6-19 సంవత్సరాలలోపు పిల్లలకు, కిశోర బాలికలకు పాఠశాలలు, కళాశాలల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్ కిరణ్, సీహెచ్ఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంసీహెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిరూపం రమాబాయి అంబేడ్కర్



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : త్యాగానికి ప్రతిరూపం రమాబాయి భీమ్‌రావ్ అంబేడ్కర్ అని సీనియర్ దళిత నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, కూకట్లపల్లి మురళిలు తెలిపారు. మాతా రమాబాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఫర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించడంలోనూ, సామాజిక న్యాయం, సంస్కరణల కోసం ఆయన చేసిన ప్రయత్నాలలోనూ ఎంతో సహకారం అందించిన ఆదర్శ మహిళ రమాబాయి అని అన్నారు. బహుజనుల బిడ్డల భవిష్యత్తు కోసం ఆమె తన బిడ్డలను సైతం త్యాగం చేసిన త్యాగమూర్తి అని అన్నారు. కార్యక్రమంలో పూలే అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ చైర్మన్ బి.గురుమూర్తి, ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్తార్, దళిత వేదిక జిల్లా అధ్యక్షుడు ఓబయ్య, ఫర్స్ డైరెక్టర్ పి.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.